# కవుల రైలు

తెలుగుదేశం కవులతో నిండి మూడవ తరగతి రైలు పెట్టెలాగ క్రిక్కిరిసి పోయింది. "ఇంక జాగాలేదు" అని కేకలేస్తున్నా వినిపించుకోక చవకగా అమ్మే టిక్కెట్లు కొనుక్కొని కొత్త కవులు తోసుకులోపలి కెగబడుతున్నారు. కొందరు ఫుట్ బోర్డులమీద నిలబడీ, కొందరు కమ్మీలు పట్టుకొని వేలాడుతున్నారు.

ఒకావిడ మేలిముసుగు వేసుకుని వచ్చింది. సుతారంగా అందంగా వుంది. కళ్ళల్లో అపూర్వమైన వెలుగు. ఎర్రని పెదవుల్లో తియ్యనిసిగ్గు వొంపులు. వెన్నెలనీ, ఉషఃకాంతినీ, మల్లెపువ్వుల్నీ, మంచిగంధాన్నీ, రత్నాల్నీ కలబోసి మనమీద జల్లినట్టు అనిపిస్తుంది ఆవిడని చూస్తే.... అక్కడ దగ్గరలో నిలుచుంటే.... ....

ఆవిడ నిస్పృహగా చూసింది రైలు పెట్టెకేసి. లోపలి బొగ్గుపులుసు గాలీ, చుట్టపొగా వాగుడూ కలసి పెట్టెలోంచి బయటికి దుర్భరంగా వ్యాపిస్తున్నాయి.

"ఇక్కడ చోటులేదు దయచేయవమ్మా, నువ్వుకూడానా మాఖర్మ" వగలొలుక బోసుకుంటూ అన్నాడొక చుట్ట ఆసామీ కాండ్రించి ఉమ్మి వేస్తూ. ఆయన కవి శార్దూల బిరుదాంకితుడు, అప్పకవీయం అడ్డంగా బట్టీవేశాడు.

"నో ప్లేస్ మేడమ్ వెరీ సారీ" అంటూ కన్నుగీటాడొక నవ యువకుడు గాగుల్సుతీసి. సెకండ్‌హాండ్ ఓడీ నోట్లో ఉంచుకునే.

కొందరు వెకిలిగా నవ్వారు. కొందరు దగ్గారు మరికొందరు యీలలువేశారు. పాపం ఆవిడ వెనక్కితిరిగి జాలిగా వెళ్ళిపోయింది. రైలుకదలిపోయింది. స్టేషన్‌మేష్టరా వచ్చే ఆమెనిచూచి "పాపం చోటులేదా అమ్మా. నీ పేరు?" అని అడిగాడు.

"కవిత" అంది సుందరి.

కవులరైలు వడవడిగా గమ్యం తెలీకుండా వెళ్ళిపోతోంది.